

బౌల్డరింగ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి

ప్రజాశక్తి - కుప్పం: కుప్పం మండలం కంగుందిలో 2026 జనవరి 6 నుండి 10వ తేదీ వరకు జరిగే బౌల్డరింగ్ ఫెస్టివల్ పోస్టర్ మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతిలో ఆవిష్కరించారు. ద్రావిడ రాష్ట్రాల కుప్పం ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మొట్టమొదటిసారి కంగుందిలో బౌల్డరింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తుండగా ఈ కార్యక్రమానికి రావాలని మంత్రి నిమ్మల రామానాయుడును ఆహ్వానించినట్లు ఏపీఈడబ్ల్యూడిసి చైర్మన్ రాజశేఖర్ తెలిపారు.



అదనపు అంతస్తు ఉందా..?

ఆమ్యామ్యాలతో సరి...!



బిపిఎస్-2025తో అందినకాడికి..
రూరల్ డికెటి భూముల్లో ఇదీ సంగతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అదనపు అంతస్తులు నిర్మించుకుంటున్నారా.... అయితే అనుమతులు ఉన్నాయా.... డీకేటి ల్యాండ్ ఆ.... పంచాయతీ నుండి అనుమతులు తీసుకున్నారా.... తీసుకోకపోతే ఆఫీసుకు రండి... అక్కడ ఏమి జరుగుతుందో తెలియదు కానీ అనుమతులు లేని నిర్మాణాలు కొనసాగిపోతాయి. పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శి ద్వారా ఇచ్చే జీ ప్లస్ 2 కాకుండా అదనపు అంతస్తులకు. రిజిస్ట్రేషన్ కలిగిన భూమి అయితే తుడా అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. డీకేటి భూమిలో కట్టుకుంటున్నట్లయితే పంచాయతీకి డబ్బులు చెల్లించాలని చెబుతున్న పరిస్థితి. తీరా ఎవరైతే అదనపు అంతస్తులు నిర్మించుకుంటారో వారు ఇచ్చిన నగదుకు కాకుండా తక్కువ నగదుకు 'గిఫ్ట్' పంచాయతీకి ఇచ్చినట్లుగా రసీదు ఇస్తున్నారు. అభ్యంతరం ఉండి ప్రభుత్వం భూమిలో కట్టుకున్న నిర్మాణమైతేనే గిఫ్ట్ కింద పంచాయతీ డబ్బులు వసూలు చేసుకోవచ్చు. కానీ ఒక హ్యాబిటేషన్‌గా రూపాంతరం చెంది, ప్రభుత్వం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించబడ్డ ప్రాంతంలో అదనపు అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి గిఫ్ట్ వసూళ్లు చేయడం గమనించాల్సిన అంశం. ఎలాగైనా నిర్మాణం పూర్తి చేసుకోవాలి కాబట్టి నిర్మాణదారుడు పంచాయతీ కార్యాలయంలో జరిగే ఈ తంతు పట్ల మౌనంగా ఉండిపోతున్నారు.

ఇదంతా ఎక్కడ అనుకుంటున్నారా... మంగళం పరిధిలో ఉన్న గ్రామపంచాయతీలలో ఈ తంతు సాగుతోంది. ఇటీవల గడిచిన రెండు నెలల కాలంలో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో ఉన్న నారా చంద్రబాబునాయుడు కాలనీ, బిటిఆర్ పురం, మంగళం క్వార్టర్స్, సప్తగిరి కాలనీ ఇలా అనేక హ్యాబిటెషన్లలో గుట్టుచప్పుడు కాకుండా ఈ ప్రక్రియ జరుగుతుండడం... అందరూ ఒక్కటయ్యారని ప్రజలే విమర్శలు చేయడం గమనించాల్సిన అంశం. జరుగుతున్న ఈ తంతుపై ఆధారాలతో త్వరలో ఎమ్మెల్యే పులివర్తి నాని ముందుకు పార్టీ నేతలు వెళ్ళనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సాధారణంగా....


గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ భూములు, డికెటి భూములలో పంచాయతీ పరిధిలో జి ప్లస్ 2 వరకు మాత్రమే పంచాయతీ కార్యదర్శి అనుమతులు మంజూరు చేస్తారు. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలను అన్నింటినీ పరిశీలించి తరువాత అనుమతులు ప్రక్రియ కొనసాగుతుంది. కానీ ఇందుకు విరుద్ధంగా అధికార పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు స్థానికంగా తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వం నుండి.....

గ్రామీణ ప్రాంతాలలో డీకేటి భూములలో పంచాయితీ నుండి పొందే జి ప్లస్ 2 కాకుండా అదనంగా నిర్మించే అదనపు అంతస్తుకు నిర్మాణం కొనసాగించడానికి ఎక్కడ అనుమతులు లేవు. గ్రామీణ ప్రాంతంలోని రిజిస్ట్రేషన్ భూములు, పట్టణాభివద్ధి సంస్థ నుండి అనుమతి పొందిన అప్రూవల్ లేఅవుట్ లలో పంచాయతీ అప్రూవల్ తో పాటుగా పట్టణాభివద్ధి సంస్థ అనుమతులతో నిర్మాణం చేయడానికి వీలు అవుతుంది. పంచాయతీ పరిధిలో డీకేటి భూములలో జి ప్లస్ 2 మించి కడుతుంటే సంబంధిత పంచాయతీ కార్యదర్శి అడ్డుకొని, సదరు నిర్మాణదారుడికి నోటీసులు జారీ చేస్తూ, నిర్మాణానికి వినియోగించే వస్తు సామాగ్రిని తరలింపు చేయాల్సిన ప్రక్రియ చేయాల్సి ఉంటుంది.

బిపిఎస్-2025 ఎంఏయుడిలలో మాత్రమే.....

రాష్ట్ర ప్రభుత్వం గత నవంబర్ 12వ తేదీ నగరపాలక సంస్థ పరిధిలో గతంలో నిర్మించబడ్డ ఇల్లు (అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలంలో) వాటికి బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ వర్తింప చేస్తూ సదరు నిర్మాణాలకు సంబంధించి చట్టబద్ధతను తీసుకురావాలని నిర్ణయించి జీవో నెంబర్ 225ను విడుదల చేసింది. అయితే ఈ జీవోను అడ్డుపెట్టుకొని గ్రామీణ ప్రాంతాల్లో వర్తించదని తెలిసినా ఈ స్కీమును స్కాముగా మార్చేస్తున్నారు కొంతమంది ఘనులు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో ఇల్లు కట్టుకొని నివాసం ఉన్న వారికి రెగ్యులరైజేషన్ స్కీమ్ విడుదల చేసింది. గతంలో. ప్రభుత్వం నిర్దేశించిన గజాల భూమికి ఉచితం. అంతకు మించితే తగిన రుసుములు చెల్లిస్తే రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ గత టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగింది. ప్రస్తుతం 20 రోజులకు మునుపు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పట్టాలు పొంది ఉండి రెగ్యులరైజేషన్ చేసుకోకపోతే రెగ్యులరైజ్ చేసుకోవడానికి కొత్త జీవోను విడుదల చేసినట్లు తెలిసింది. అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో నివాసాలు ఉన్న వారికి ప్రభుత్వం నుండి రెగ్యులరైజేషన్ జీవో రావాల్సి ఉంది.



గంజాయి మూకల చేతిలో బలైన ప్రజానాట్యమండలి కళాకారులు, మాజీ డివైఎఫ్ఐ నాయకులు పెంచలయ్య కుటుంబానికి ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభ సందర్భంగా రూ.50వేల ఆర్థిక సాయం

ఏచూరి వారసత్వంతో ఉద్యమాలు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు సక్సెస్
68 మందితో నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలు తిరుపతినగరంలో మూడు రోజుల పాటు స్ఫూర్తిదాయకంగా జరిగాయి. ఆదివారం నూతన కమిటి నాయకత్వం ఎన్నికతో మహాసభ ముగిసింది. క్యాడర్‌కు అత్యంత ఉత్సాహాన్ని ఇచ్చాయని, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల పోరాటాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ అన్నారు. భగత్‌సింగ్, ఏచూరి ఉద్యమ వారసత్వాన్ని నూతన నాయకత్వం ముందుకు తీసుకెళ్లాలన్నారు. విద్యార్థి ఉద్యమమే పోరాటాల పటిష్టతకు పునాది అన్నారు. తిరుపతి వేదికగా మూడు రోజుల పాటు చర్చించి, రూపకల్పన చేసిన తీర్మానాలను భవిష్యత్ ఉద్యమాల్లో సఫలీకృతమవ్వాలన్నారు. మహాసభల విజయవంతానికి చేదోడువాదోడుగా నిలిచిన, ఆర్థికంగా సాయబడిన అందరికీ వేదికపైనుంచి ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు వీరసైనికుల్లా మహాసభల విజయవంతానికి కష్టపడ్డారని అభినందనలు తెలిపారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులుగా భగత్‌రవి



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా భగత్‌రవి ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ ఎన్నిక కాగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి భగత్‌రవి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

వరి ధాన్యాన్ని ధ్వంసం చేసిన ఏనుగులు

ఆరుగాలం కష్టించి పండించిన పంట కోల్పోయామని రైతుల ఆవేదన



వరి ధాన్యాన్ని తిని, తొక్కి చిందరవందరగా చేసిన ఏనుగులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పార్వతి నగర్‌కు చెందిన మహిళా రైతు అలివేలు తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో వరి పంట సాగు చేసి పంట నూర్పిడి చేసి గ్రామసమీపంలోని బండపై వరి ధాన్యాన్ని ఎండబెట్టేందుకు రాశులు పోసి ఉంచారు. ఆదివారం తెల్లవారు జామున ఏనుగుల గుంపు బండపై ఉన్న వరి ధాన్యం రాశులను ధ్వంసం చేశాయి. తమకున్న కాస్త వ్యవసాయభూమిలో వరిసాగు చేసి పంట కోత కోసి నూర్పిడి చేసి ఎండబెట్టేందుకు బండపై పోసి ఉంచితే ఏనుగులు ధాన్యం మొత్తం తిన్నంత తిని మిగిలిన ధాన్యాన్ని చిందర వందర చేసి తమకు తీవ్ర-నష్టాన్ని కలిగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఏనుగుల దాడుల్లో పంటను నష్టపోతూనే ఉన్నామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఈ ఏనుగుల గుంపు ఇరికిపెంట, సోమల పంచాయతీల పరిధిలోని అటవీ ప్రాంతాలలో పగటిపూట చెట్ల పొదుల చాటున ఉంటూ రాత్రి వేళల్లో పంటలపై దాడులు చేస్తున్నాయి. నెరుకూరివారిపల్లెలో రెండు రోజుల క్రితం గ్రామంలోని ఏనుగులు రాత్రి వేళల్లో సంచరిస్తూ ఘీంకారం చేస్తూ గ్రామస్తులను భయాందోళనలకు గురిచేశాయి. టమాటా, వరి పంటలపై దాడులు చేయడం, బోరు పైపులు, డ్రిప్ పైపులు ధ్వంసం చేసి, కొబ్బరి, మామిడి మొక్కలను విరిచేస్తూ ఈ ప్రాంత రైతులకు తీవ్రంగా నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఏనుగుల సమస్యతో రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపకపోవడం రైతులకు ఆగ్రహాన్ని కలిగిస్తోంది.

అడవుల సమీపంలో సోలార్ కంచె వేసి ఏనుగులు అడవి నుండి పొలాలు గ్రామాల వైపు రాకుండా చూడాలని, పూడిపోయిన కందకాలను మళ్లీ తవ్వించాలని దీనికోసం అటవీ, మండల శాఖ అధికారులు సర్వే నిర్వహించి కంచె ఏర్పాటుకు సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఏనుగుల వలన కలిగే పంట నష్టంతో రైతులు వ్యవసాయ భూములను బీడు భూములుగా వదిలేస్తున్నారని, ఇకనైనా ఏనుగుల బెడద నుండి విముక్తి కలిగించాలని కోరుతున్నారు. రైతుల పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించి దీనిపై సమావేశాలు జరిపి సోలార్ కంచె ఏర్పాటుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో నిర్ణయించి ఏనుగుల భారీ నుండి పంటలను ప్రాణనష్టాన్ని నివారించాల్సిన అవసరం ఉంది.





పొలం వద్ద ఏనుగుల పాదముద్రలు, పంటనష్టపోయిన రైతు

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మేయర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రస్తుత బిజీబిజీ జీవితంలో ప్రతి మనిషికి వినోదం ఎంతో అవసరమని చిత్తూరు నగర మేయర్ అముద అన్నారు. ఆదివారం చిత్తూరు నగరంలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన మల్లి వసుంధర జలకన్య ఎగ్జిబిషన్‌ను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సోదరుడు గురజాల జీవన్‌తో కలిసి ప్రారంభించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు మల్లికార్జున, లక్ష్మీపతి మాట్లాడుతూ చిత్తూరు నగరం, పరిసర ప్రాంతాల ప్రజలకు అన్నివిధాల సౌకర్యవంతమైన స్థలంలో ఏర్పాటు చేసిన వసుంధర జలకన్య ఎగ్జిబిషన్‌ను ప్రజలు సందర్శించాలని కోరారు. ఎగ్జిబిషన్లో ఈ ఎడాది నీటిలో ఈదుతూ సరికొత్త వినోదాన్ని పంచేలా ప్రత్యేకంగా జలకన్యలను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా ఎగ్జిబిషన్లో ఏర్పాటుచేసిన జెయింట్ వీల్, కొలంబస్, డ్రాగన్ ట్రైన్, బౌన్సింగ్ డాల్, నీటిపై కార్ సవారి, తదితర అమ్యూజ్మెంట్స్ ఎంతో వినోదాన్ని పంచుతాయన్నారు. వీటితో పాటు షాపింగ్ ప్రియుల కోసం సరికొత్త వస్తువులను ప్రదర్శన, విక్రయానికి ఉంచినట్లు వెల్లడించారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. చిత్తూరు నగర డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకురాలు హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 15వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 15వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ సెల్..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 15వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డీపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 15వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ కోరారు.

కుప్పంలో పిజిఆర్ఎస్ వాయిదా..

కుప్పం: కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం 15వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని వచ్చే సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్‌ను నిర్వహించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కృషి

- జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రాథమిక, మాధ్యమిక ఉన్నత ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయనున్నట్లు విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రధానంగా మార్చిలో నిర్వహించనున్న పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల కార్యచరణ ప్రణాళిక పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలు జిల్లా విద్యాశాఖ అధికారి విద్యాప్రమాణాల పెంపుపై మాట్లాడుతూ....

ప్రజాశక్తి: ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీఈవో: జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సహకారంతో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అనేక ప్రోత్సాహాలను అందిస్తోంది వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలి.

ప్రజాశక్తి: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

డీఈవో: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రభుత్వం 100 రోజుల కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ 100 రోజులపాటు ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి వీరి పట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రజాశక్తి: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు ఎన్ని ఉన్నాయి..?

డీఈవో: జిల్లాలో 4,712 ప్రాథమిక మాధ్యమిక ఉన్నత పాఠశాలల్లో 2,33,503 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ప్రజాశక్తి: డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు ఎన్ని భర్తీ చేశారు.


డీఈవో: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 1,478 పోస్టుల భర్తీకి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా జిల్లా పరిషత్తులో 1,312, మున్సిపాలిటీ 97, మున్సిపల్ కార్పొరేషన్ 64 పోస్టుల భర్తీలో 1,398 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.

ప్రజాశక్తి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలలుగా ఎన్ని మారాయి.

డీఈవో: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను 44 జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరించడమైనది. ఎంపీసీ, బైపిసి, సిఇసి కోర్సులు నడుస్తున్నాయి. ప్రస్తుతం 1,120 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ ఏది..?

- గురుకుల పాఠశాల, శ్మశాన స్థలం ఆక్రమణ



ప్రజాశక్తి- బంగారుపాళ్యెం: మండలంలోని మొగిలి గ్రామసమీపాన గల ఊరగుట్టను అగ్రవర్ణాలకు చెందిన కొందరు ఆక్రమిస్తున్నారని, అంతేకాకుండా గురుకుల పాఠశాల, శ్మశాన స్థలాన్ని సైతం కబ్జా చేస్తున్నారని ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ భూమిని, గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని, అలాగే శ్మశానికి కేటాయించిన స్థలాన్ని కొందరు అగ్రవర్ణాల వారు శని, ఆదివారాలు సెలవు రోజుల్లో చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. గతంలోనే మొగిలి ఊరగుట్ట ప్రాంతాన్ని ఎస్టీల శ్మశానాన్ని అక్రమంగా ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేసిన ఫలితంగా అధికారులు స్పందించి ఊరుగుట్ట ప్రాంతాన్ని సర్వే చేసి 56 ఎకరాలు ప్రభుత్వ స్థలమని తేల్చారని తెలిపారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారి నుండి పట్టాల రద్దు చేశారని ఆ స్థలంలో పేదవిద్యార్థులు చదువుకోడానికి గురుకుల పాఠశాల నిర్వహణకు ఐదు ఎకరాలు రెవెన్యూ అధికారులు కేటాయించి వారికి స్థలాన్ని అప్పగించడంతోపాటు ప్రభుత్వ బోర్డు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో స్థలాన్ని ఆక్రమించిన వారే జెసిబిలు పెట్టి చదును చేసి శ్మశాన స్థలాన్ని గురుకుల పాఠశాల స్థలాన్ని చదును చేసి ఆక్రమిస్తున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్‌కి, డిఆర్ఓకి, ఆర్‌డిఓలకు సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, పేదలకు న్యాయం చేయాలని లేకుంటే ఎస్టీలను కూడగట్టుకుని పోరాటం చేస్తామన్నారు. న్యాయంగా ఎస్టీలకు చెందాల్సిన భూములను వారికే కేటాయించాలని కోరారు.

బాలుర హాస్టల్‌ను పరిశీలించిన ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- రామకుప్పం: మండల శివార్లలోని బాలుర ఎస్సీ హాస్టల్‌ను ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పరిశీలించారు. హాస్టల్లోని పరిసరాలను, హాస్టల్ వసతి గృహాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి యోగి క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న భోజన వసతులపై హాస్టల్ సిబ్బందితో చర్చించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల పర్యవేక్షణను పరిశీలించారు. ఎస్ఐ వెంకట మోహన్, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, సీతాపతి పాల్గొన్నారు.



వరసిద్ధుని సేవలో తిరుపతి ఎమ్మెల్యే



ప్రజాశక్తి- ఐరాల: శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఈవో పెంచల కిషోర్, దేవస్థానం చైర్మన్ మణి నాయుడు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు సుధాకర్ రెడ్డి, ఆలయ ఏఈవో రవీంద్రబాబు, స్థానిక నాయకులు ఉన్నారు.

నాటు బాంబు పేలి వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కుప్పం



అడవి పందుల కోసం అమర్చిన నాటు బాంబు పేలి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ ఘటన కుప్పం మండలంలో చోటుచేసుకుంది. కొట్టాలూరు పంచాయతీ ఎర్రమన్ను గుంతలు గ్రామానికి చెందిన చిన్న తంబి (38) పశువుల మేపేందుకు సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్ళాడు. అయితే అడవి పందుల కోసం పెట్టిన నాటు బాంబు కనబడడంతో చిన్న తంబి దాన్ని తన పొలం వద్దకు తీసుకువచ్చి తెరిచే ప్రయత్నం చేయగా అది పేలడంతో చిన్న తంబి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం కుప్పం పిఈఎస్ ఆసుపత్రికి తరలించారు. నాటు బాంబు పేలడంతో చిన్న తంబి శరీరం ఓ వైపు కాలిపోవడంతో అతని పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై కుప్పం పోలీసులు విచారణ చేపట్టారు. అటవీ ప్రాంతంలోని గుట్ట వద్ద దొరికిన నాటు బాంబును చిన్న తంబి తీసుకువచ్చి తన ఇంటికి సుమారు 100 మీటర్ల దూరంలోని పొలం వద్ద ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా అది బ్లాస్ట్ అయ్యిందని పోలీసులు తెలిపారు.

దిగులు తీర్చిన దిత్వా

- వ్యవసాయానికి సానుకూలం
- వరి సాగుకు సిద్ధం
- రైతుల్లో చిగురించిన ఆశలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలో డిసెంబరు మొదటి వారంలో కురిసిన దిత్వా తుపాను ప్రభావంతో రైతులకు మంచి చేకూరింది. మండలంలో అక్కడక్కడా స్వల్ప నష్టం వాటిల్లింది. దీంతో అటు ప్రభుత్వ యంత్రాంగం, ఇటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో తుపాను వెను తిరగడం వల్ల రైతులకు సానుకూలమైన వాతావరణమే ఏర్పడిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా చెరువులు కొంతమేర నిండాయి. మొరవలు (కలువలు) పోయాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో రైతు కుటుంబాలలో ఆశలు చిగురించ చాయి.


వరి సాగుకు పొలం సిద్ధం చేస్తున్న రైతులు

వ్యవసాయానికి సానుకూల వాతావరణం

ఈ రబీ సీజన్‌లో మండలం లోని రైతు కుటుంబాలు వరి నాట్లు వేసేందుకు దుక్కులు దున్నుతున్నారు. రైతు కుటుంబాలు ఈ పనుల్లో బిజీ బిజీగా ఉంటూ వ్యవసాయం సాగుచేస్తున్నారు. ఇది సానుకూల ప్రభావం అని మండల వాసులు చెబుతున్నారు. గత సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది 2,500 హెక్టార్ల మేర వరిని సాగు చేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పొలాల్లో వేసేందుకు ఆకులు సిద్ధం చేస్తున్న రైతులు

వరి సాగుకు సిద్ధం

మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో రైతుల కోసం 13 సచివాలయాల సిబ్బంది శ్రమిస్తున్నారు. ఈ సారి అధిక శాతం మంది రైతులు వరి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సుమారు 2,500 హెక్టార్లలో వరి సాగు పెరగ వచ్చునని వ్యవసాయ అధికారులు అంచనాకు వచ్చారు. మండలంలో వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబం తమ తమ భూముల్లో వ్యవసాయ పనులు చేసుకుంటూ బిజీ బిజీగా కాలం గడుపుతున్నారు. ట్రాక్టరుతో అడుసు దున్నడం, భూసారం పెంచేందుకు కాలువ గట్లుపై ఉన్న చెట్లలో ఆకు కొమ్మలను కత్తిరించి చేలల్లో వేస్తున్నారు. సేంద్రియ ఎరువులు వేసే పనుల్లో నిమగ్నమై రైతులు వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. పెట్టుబడులు ఎక్కువగా పెరిగే అవకాశం వుందని రైతులు పేర్కొంటున్నారు.

సకాలంలో యూరియా..



మండలంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు కొరత లేకుండా యూరియా ను అందుబాటు లోకి తెచ్చాం. ప్రభుత్వానికి వ్యవసాయ కార్యా లయం ద్వారా పంపించిన డిమాండ్ మేరకు ప్రభుత్వం యూరియా అందించింది. ఎక్కడా ఇబ్బంది లేదు. కావలసిన యూరియాను అంచనా వేసి జిల్లా స్థాయి అధికారులకు నివేదిక అందజేస్తాం. మరో 15 రోజుల్లో మళ్లీ అందిస్తాం.

- వనిత, వెదురుకుప్పం మండల వ్యవసాయ అధికారి,


కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు పార్వతిదేవి

కరాటే బెల్టులు ప్రదానం

ప్రజాశక్తి -విజయపురం (నగరి): పట్టణ పరిధిలోని జపాన్ షిటోరాయ్ కరాటే పాఠశాలలో శిక్షణ పొంది ప్రతిభ కనబరచిన వారికి ఆదివారం బెల్టులు ప్రదానం చేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ బెల్టుల ప్రదానోత్సవానికి వేలూరు షిటోరాయ్ కరాటే పాఠశాల నిర్వాహకులు రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఐదుగురికి బ్లాక్ బెల్టులు, ఇతర విద్యార్థులకు తెలుపు, పసుపు రంగు బెల్టులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ అన్నాదురై, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పార్వతి దేవి పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంటులో విజయం సాధించిన వెదురుకుప్పం జట్టు

క్రికెట్ టోర్నమెంటు విజేత వెదురుకుప్పం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని ఉపాధ్యాయుల క్రీడలలో భాగంగా ఆదివారం నగరిలో నిర్వహించిన పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌లో వెదురుకుప్పం జట్టు విజయం సాధించింది. విజయపురం, వెదురుకుప్పం మండలాల ఉపాధ్యాయ క్రికెట్ టీంలు తలపడ్డ ఈ టోర్నమెంటులో వెదురుకుప్పం మండల జట్టు విజయం సాధించింది. వారు అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. వెదురుకుప్పం మండల విద్యాశాఖ అధికారి దాము క్రికెట్ టీమ్‌ను అభినందించారు. మండలానికి గుర్తింపు వచ్చిందని కొనియాడారు.


క్రికెట్ పోటీలో సెమీ ఫైనల్‌కు చేరిన యాదమరి టీం

సెమీ ఫైనల్‌కు యాదమరి టీం

ప్రజాశక్తి -యాదమరి: ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుల కిక్రెట్‌లో యాదమరి మండల టీం పూతలపట్టు టీంపై 67 పరుగుతో విజయం సాధించి సెమీ ఫైనల్ చేరుకుందని కెప్టెన్ సిరాజ్ తెలిపారు. ఈ మ్యాచ్‌లో కె గొల్లపల్లి ఉపాధ్యాయుడు నాగ భూషణం అత్యధికంగా 41 పరుగులు సాధించారని, అయూబ్ 26 పరుగులు సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకోవడానికి తోడ్పడ్డారు. ఆదివారం పోటీల్లో జె భాస్కర్ రెడ్డి, మహేష్, విశ్వనాథ్, సురేష్, సబీర్, సుధాకర్ రెడ్డి మంచి నైపుణ్యం ప్రదర్శించారన్నారు. మంచి జోష్ తో సోమవారం నిర్వహించే సెమీ ఫైనల్లో, ఫైనల్లో ఆటలలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి యాదమరికి కప్‌తో రావాలని మండల విద్యాశాఖాధికారులు రుక్మిణమ్మ, హెచ్ఎల్ఎన్ ప్రసాద్, హెచ్‌యంలు లలిత, హేమలత, రమాబాయి, చంద్ర శేఖర్, సంఘనాయకులు కనకాచారి, మదన్ మోహన్ , హిమబిందు రెడ్డి, శివప్రసాద్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండలం మదర్ థెరీసా ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2014 వ సంవత్సరం నుండి 2025 వరకు 12 సంవత్సరాల్లో బీటెక్ కోర్సు పూర్తి చేసుకుని కళాశాల వదిలి వెళ్లిన విద్యార్థుల కలయిక పండుగ వాతావరణం తలపింప చేసిందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం రవీంద్ర బాబు తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఎన్‌టియు సిఎస్ఇ విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ బాబు కీలక ఉపన్యాసం చేశారు. ఈ అపూర్వ కలయిక పూర్వ విద్యార్థులకు గత విషయాలను గుర్తు చేసు కుంటూ కళాశాలలో చేస్తున్న అభివృద్ధిని తెలుసుకోవడానికి వీలు కలుగుతుందని ప్రతి ఏడాది డిసెంబరు రెండవ ఆదివారం ఈ పండుగను జరుపుకోవడం చాలా సంతోషాన్ని ఇస్తోందన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను సమావేశంలో ఇతరులతో పంచుకున్నారు. ఈ సమ్మేళనంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం రవీంద్ర బాబు, కళాశాల చైర్మన్ ఎంఆర్‌సునీల్, డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ రెడ్డి ప్రసాద్, హెచ్‌ఓడిలు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


హీరో సుమన్‌తో గౌడ సంఘం నాయకులు

సుమన్‌ను కలిసిన గౌడ సంఘం నాయకులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: సినీ హీరో సుమన్‌ను గౌడ సంఘ నాయకులు ఆదివారం హైదరాబాదులోని ఓ కార్యక్రమంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు గౌడ కులస్తులకు రావలసిన అన్ని వసతులను ఏర్పాటు చేయాలని రెండు రాష్ట్రాలలోని కల్లుగీత కార్మికులకు అండగా ఉండాలని విన్నవించినట్టు తెలిపారు. ఈడిగ బిసి సాధికార సమితి అధ్యక్షులు బుసా నాగరాజ గౌడ్, జిల్లా గౌడ్ సంఘం ఉపాధ్యక్షులు బుసా జనార్ధన్ గౌడ్, బుసా సుబ్రహ్మణ్యం గౌడ్, చంద్రయ్య శెట్టి, మేస్త్రి నాగరాజ పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గురు రాజారావు

ప్రజాశక్తి- పలమనేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో పని చేసి రిటైర్డ్ అయిన పెన్షనర్ల 2026 జనవరి1నుండి మాత్రమే లైఫ్ సర్టిఫికెట్లు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఖజానా శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అసోసియేట్ అధ్యక్షులు గురు రాజారావు తెలిపారు. స్థానిక పలమనేరు నార్త్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులందరూ వారు పొందుతున్న పెన్షన్ కొనసాగించాలంటే తాము జీవించినట్లు లైఫ్ సర్టిఫికెట్లు జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా ప్రతి సంవత్సరం జనవరి 1నుండి ఫిబ్రవరి 28 లోగా సమర్పించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. పెన్షనర్ల అందరు సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో, అసోసియేషన్ కార్యాలయాల్లో, నెట్ సెంటర్లు, మీ సేవ కేంద్రాల్లో, పోస్టాఫీసుల్లో గాని జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా సమర్పించ వచ్చునని తెలిపారు. ధ్రువీకరణ ప్రక్రియలో ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, బుక్ పిపిఓ నంబర్, సిఎఫ్‌యంఎస్ నెంబర్, ఓటిపి కోసం మొబైల్, తప్పక తీసుకొని వెళ్లాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యం కారణంగా ఖజానా కార్యాలయానికి రాలేని పక్షంలో ఆఫీసరుకు తెలిపితే తగు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్, జ్ఞానాళ్వార్, ఆర్ముగం శెట్టి, గురుసామి నాయుడు, మస్తాన్ నర్సింహులు, అక్బర్ బాషా, మాలతి భద్రమ్మ బాలసుబ్రహ్మణ్యం , చెంగులయ్య, పురుషోత్తం, నాగభూషణం, చంద్రశేఖర్, రమేష్ బాబు, వినాయకం, నాగభూషణమ్మ , జగదీశ్వరయ్య, నిజాం సాహెబ్ స్వామినాథన్, చక్రపాణి శెట్టి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిటైర్డు ఉద్యోగలు సంఘం నాయకులు గురురాజారావు



రైతులను పూర్తిగా విస్మరించారు

- మాజీ మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి విజయపురం (నగరి): చంద్రబాబు ప్రభుత్వం రైతులని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి ఆర్కేరోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరి రైతులు నిలదీస్తే మంత్రి పార్థసారథి ఫ్రస్టేషన్‌కు వెళ్లిపోయారని అధికారులపై ఆయన బూతు పురాణం చూస్తే అది స్పష్టమౌతోందన్నారు. జగనన్న పాలనలో రైతుల్ని కుటుంబ సభ్యులుగా చూసుకున్నారని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. వారానికి ఇద్దరు రైతులు చనిపోతున్నారని, 18 నెలలు కాలంలో 300 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ఏ ఒక్క రైతును పట్టించుకోలేదన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ప్రత్యేక హెలికాప్టర్‌లలో జల్సాలు చేస్తూ విహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో వరి, మామిడి, చెరకు, ఉల్లి, పొగాకు, టమోటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన సొంత జిల్లాలో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జ్యూస్ ఫ్యాక్టరీలు మామిడి రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా మోసం చేస్తుంటే వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రైతులకు మేలు చేయని వారు పదవుల్లో ఉండటానికి అనర్హులని వారు వెంటనే రాజీనామా చేయాలన్నారు. నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ నగరిలోనే ఉండటం లేదని ఇక్కడి ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన ఎక్కువగా తిరుపతి, విజయవాడలోను ఉంటున్నాడన్నారు. 18 నెలల్లో రెండు సార్లు అమెరికాకు వెళ్లి వారాల తరబడి అక్కడే ఉంటున్నారని, నగరిలో దోచుకోవడం అమెరికాకు వెళ్లి దాచుకోవడం మాత్రమే చేస్తున్నారన్నారు. ప్రజల పక్షాన మనం నిలబడాలని చంద్రబాబు ప్రభుత్వం చేసే ప్రతి అన్యాయాన్ని, అరాచకాన్ని, మోసాన్ని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, వైస్‌చైర్మన్ జయప్రకాష్, ఎంపీపీలు భార్గవి, మునివేలు, వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ కమిటీ, అనుబంధ కమిటీ నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చెన్నె శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి మండలం లోని వివిధ గ్రామాల నుంచి కంటి సమస్యలతో బాధ పడుతున్న వారు 42 మంది ప్రజలు హాజరయ్యారు. వారికి డాక్టర్లు పరీక్షలు నిర్వహించిన అనంతరం కంటి శస్త్ర చికిత్సలకు 20 మందిని ఎంపిక చేశారు. అంతకు ముందు కంటి శస్త్ర చికిత్స చేయిం చుకున్న వారికి అవసరమైన కంటి అద్దాలు అందించారు. శిబిరంలో ఎంపికైన రోగులకు ప్రఖ్యాత చెన్నె శంకర నేత్రాలయ హాస్పిటల్‌లో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన రోగులు, వారి సహాయకులకు ఉచిత ప్రయాణం, భోజనం, వసతి, మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారు, వారి సహాయకులకు మధ్యాహ్న శ్రీనివాస హోటల్‌కు చెందిన దిలీప్ భోజనం, తాగునీటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ నేత్రాలయ డాక్టర్లు గంగాధరం దాసర్లపల్లి, మురళీకృష్ణ, శ్రీనివాసులు, రమణ, చంద్ర, చిన్నప్ప, బైరెడ్డిపల్లి జయరామిరెడ్డి పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

టిడిపి మైనార్టీ అధ్యక్షుడుగా జాకీర్

ప్రజాశక్తి-కుప్పం: టిడిపి కుప్పం నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడుగా మూడోసారి జాకీర్ ఎన్నికయ్యారు. గతంలో రెండుసార్లు మైనార్టీ అధ్యక్షుడుగా పనిచేసిన జాకీర్‌ను మరోమారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాకీర్ నియామకంపై మైనార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో మూడోసారి అవకాశం కల్పించిన పార్టీ శ్రేణులకు జాకీర్ కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడి పని చేస్తామన్నారు.


ముఖ్య మంత్రిని కలిసిన టిడిపి మైనార్టీ అధ్యక్షుడు జాకీర్


అన్నదానానికి విరాళం అందిస్తున్న టిడిపి నాయకుడు

అన్నదానానికి రూ. పదివేల విరాళం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల దళితవాడకు చెందిన 30 మంది మహిళలు ఓం శక్తి మాల ధరించి పూజలు చేస్తున్నారు. వారు అన్నదానం చేసేందుకు అడుసుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్(మణి) పదివేల రూపాయల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట రమణ, మహిళలు పాల్గొన్నారు.

షీ లీడ్స్ ఆంధ్రను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -రామకుప్పం: మహిళల అభ్యున్నతి కోసం కూటమి నేతృత్వంలో ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రవేశ పెడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని రామకుప్పం మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామరాజ్ నాయక్ కోరారు. సోమవారం ఉదయం 11 గంటలకు రామకుప్పం లోని ఎంపిడిఓ కార్యాలయంలో మహిళలకు ఈ మేళా ఉంటుం దన్నారు. ఈ కార్యక్రమానికి రామకుప్పం మండల టిడిపి, జనసేన, బీజేపీ, పార్టీల ప్రధాన నాయకులు, ఎంపీపీ, నామి నేటెడ్ చైర్మన్ లు, డైరెక్టర్స్, క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు గ్రామ పంచాయతీ స్థాయి సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు , బూత్ కన్వీనర్లు హాజరై తమ పరిధిలోని అర్హులైన వారందరికీ తెలిపి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండలానికి 250 యూనిట్స్ మంజూరు అయ్యాయని, స్వయం సహాయక సంఘాల మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కిరాణా దుకాణం, బూసా షాప్,టైలరింగ్ షాపులు, బ్యూటీ పార్లర్లు,ఎలక్ట్రిక్ , దుకాణాలు, హోటళ్ల వారు అర్హులన్నారు. మేళాకు హాజరయ్యే వారు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు,ఆధార్ కార్డ్ జిరాక్స్,పాన్ కార్డ్ జిరాక్స్,బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ వంటి ధ్రువ పత్రాలు తీసుకురావాలన్నారు.

బిల్డింగ్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -విజయపురం (నగరి): అసంఘటిత రంగంలోని వెల్డింగ్ కార్మికులకు లేబర్ విభాగ అధికారులు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బిల్డింగ్ సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో వెల్డింగ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణంలో కానీ పరిశ్రమల నిర్మాణంలో ప్రతి పనిలోనూ వెల్డింగ్ కార్మికులు ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. ఈ రంగంలో పనిచేయు కార్మికులకు కొంతకాలానికి ఆరోగ్యపరంగా అనేక ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 150 మంది కార్మికులు ఈ రంగంలో పనిచేస్తు న్నారన్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదన్నారు.


మున్సిపల్ మైనార్టీ అధ్యక్షుడిగా ఉమర్

ప్రజాశక్తి-కుప్పం: టిడిపి మైనార్టీ కుప్పం మున్సిపల్ పార్టీ అధ్యక్షుడిగా ఉమర్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుప్పం టిడిపి కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ మైనార్టీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జావిద్, ఇస్మాయిల్, జనరల్ సెక్రెటరీగా మహబూబ్ బాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మక్బూల్ బాషా, ఇస్మాయిల్ సమీర్, సెక్రటరీలుగా జహీర్ అహ్మద్, సలీం జావిద్, సయ్యద్ ఫయాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపాల్టీ పార్టీ అధ్యక్షుడుగా తనకు అవకాశం కల్పించడం పట్ల ఉమర్ ఖాన్ పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, నియోజవర్గ మైనారిటీ అధ్యక్షుడుజాకిర్, షాది మహల్ చైర్మన్ సర్దార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మున్సిపల్ మైనార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉమర్

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శివ ఫొటో స్టూడియో

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో చిత్తూరు నగరంలోని గ్రీన్స్ పేటలో ఏర్పాటు చేసిన శివ ఫొటోస్ స్టూడియోను ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టిడిపి యువ నాయకులు వసంత కుమార్ ప్రారంభించారు. చెన్నై, బెంగళూరు నగరాలకు దీటుగా చిత్తూరు నందు ఫోటో స్టూడియోను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శివ ఫోటో స్టూడియో అధినేత శివ మాట్లాడుతూ తమ ఫొటో స్టూడియోలో అన్ని రకాల శుభకార్యాలకు, చిన్నారుల బర్తడే ఫంక్షన్లకు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో ఫొటోలు, వీడియోలు తక్కువ ధరలకు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ షణ్ముగం , నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు కోలా కిరణ్ పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



రొంపిచర్ల వాసికి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవా రత్న అవార్డు

ప్రజాశక్తి - రొంపిచర్ల: గ్రేట్ విజన్ సొసైటీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను చాయ్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ 2025వ సంవత్సరానికి రొంపిచర్ల మండలం జాండ్ల వారి పల్లి గ్రామపంచాయతీ కణం కాడ దళితవాడ కు చెందిన జివి సుబ్రహ్మణ్యం, బాబు, సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవారత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం చెన్నైలోని ఐపీఎస్ ట్రెనింగ్ సెంటర్లో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం బాబు మాట్లాడుతూ ఈ అవార్డు తన పనితనాన్ని మరింతగా పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో చాయ్ సంస్థ ఇంటర్నేషనల్ కార్యదర్శి ఇరుదు స్వామి, వైస్ చైర్మన్ డాక్టర్ ధరణి నరసింహారెడ్డి, క్రాస్ నేషనల్ చైర్మన్ డాక్టర్ లక్ష్మీపతి పాల్గొన్నారు.



సదాశివానికి గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ చైర్మన్ డాక్టర్ డి.సదాశివం విద్యా రంగంలో చేసిన విశిష్ట సేవలకు, గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జిహెచ్‌పియు) నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. ఈ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వర్చువల్ ఇన్స్టిట్యూట్‌గా (యుఎస్ఎ)లోని డెలావేర్ రాష్ట్రంలో విదేశాంగ కార్యదర్శి ద్వారా విలీనం చేసి నిర్వహించబడుతోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సామాజిక బాధ్యతతో డాక్టర్ సదాశివం పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఆదర్శంగా నిలిచారు. ఆయన నాయకత్వంలో వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఈ ప్రాంతంలో ప్రైవేట్ విద్య ప్రమాణాలను గణనీయంగా బలోపేతం చేసింది. తిరుపతి జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ సదాశివం విద్యా సంస్థల అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక స్పృహను విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యంగా ఆయన చేపట్టిన కార్యక్రమాలు ప్రశంసనీయమని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ సదాశివానికి గౌరవ డాక్టరేట్ లభించడం వివేకానంద విద్యా సంస్థల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులకు గర్వకారణంగా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా వివేకానంద విద్యా సంస్థల ఆధ్వర్యంలో హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

తారు రోడ్డు ధ్వంసం

- కంకరతేలి గుంతలమయం
- రాకపోకలకు ఇబ్బందులు
- దుస్థితిలో మహదేవ మంగళం కట్ట రోడ్డు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు : నాలుగు పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగించే చెరువుపై వున్న తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రహదారి కంకరతేలి గుంతలమయమైంది. రాక పోకలు సాగించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో ఈ రహదారిలో ఆర్‌టిసి బస్సు నడిచేది. ప్రస్తుతం మహదేవ మంగళం చెరువు కట్ట రోడ్డు దుస్థితికి చేరడంతో బస్సు సర్వీసు పూర్తిగా ఆగిపోయింది. దీంతో ఈ రహదారిలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


తారు రోడ్డు ధ్వంసం

మండలంలోని మహదేవమంగళం చెరువు కట్ట తారు రోడ్డు ధ్వంసమై కంకర తేలిపోయింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

కంకరతేలి గుంతలమయం

మండలంలో చిన్న వేపంజేరి, మహదేవ మంగళం, తిరువీధి కుప్పం, కడపగుంట, పంచాయతీలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించాలంటే మహదేవ మంగళం చెరువు కట్ట రహదారి ఒక్కటే మార్గం... ఈ చెరువు కట్టపై ఉన్న తారు రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడి కంకర తేలిపోయింది. వర్ష సమయంలో గుంతల్లో నీళ్లు చేరి ప్రమాదాలకు నిలయంగా మారింది.

రాకపోకలకు ఇబ్బందులు


గుంతలమయమైన తారురోడ్డు

చిత్తూరు -తిరువీధికుప్పం ఆర్‌టిసి బస్సు సైతం ఈ రహదారిలోనే గతంలో రాకపోకలు సాగించేది. రహదారి దుస్థితికి చేరడంతో ప్రస్తుతం ఆ బస్సు సర్వీసు నిలిచిపోయింది. ప్రజలు, వాహన చోదకులు రాకపోకలు సాగించాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన తారు రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుచ్చి వాహనంపై బంగారమ్మ విహారం

- సంప్రదాయ దుస్తులతో గ్రామ పెద్దలు
- అమ్మవారికి సారె సమర్పణ

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన బంగారమ్మ ఆదివారం తిరుచ్చి వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి పాలు, పెరుగు, తేనే, పసుపు, చందనం, నారికేళీ జలాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్టించి మేళ తాళాల మధ్య అంగ రంగ వైభవంగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

సంప్రదాయ దుస్తులతో సారె

గ్రామ దేవత బంగారమ్మ జాతరను పురస్కరించుకుని గ్రామ పెద్దలు సంప్రదాయ దుస్తులు ధరించి జెండాలు పట్టి గ్రామ వీధుల్లో ఊరేగుతూ కేరళా వాయిద్యాలు, కోలాటాల మధ్య అమ్మవారికి సారెను తీసుకెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



సంప్రదాయ దుస్తులతో గ్రామ పెద్దలు

ఇందులో భాగంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ జాతర వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు యువత గ్రామ పెద్దలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో ఐదవ వారంలో నిర్వహించే ఊరి జాతరకు సంస్థానాధీశుల కాలం నుంచి ఒక ప్రత్యేక వుందన్నారు.